క్లుప్తంగా

13న గురుకుల ప్రవేశాలకు రాత పరీక్ష

గొలుగొండ : గొలుగొండ ఏపీ బాలయోగి గురుకుల కళాశాలలో 5, ఇంటర్ ప్రవేశానికి రాత పరీక్ష ఈనెల 13న నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ కోటేశ్వర్రావు తెలిపారు. ఐదో తరగతికి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఇంటర్‌కు మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు విద్యార్థులకు రాత పరీక్ష నిర్వహించి అందులో మంచి మార్కులు వచ్చిన వారికి సీట్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు.

రావికమతం విద్యుత్ ఏఈగా శ్రీనివాస్



రావికమతం : రావికమతం మండల విద్యుత్ శాఖ ఏఈగా కె.శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఏఈ నందన్ పార్వతీపురం ఏడీఈగా పదోన్నతిపై బదిలీ అవ్వడంతో అతని స్థానంలో అనకాపల్లి ఎంఆర్‌టీలో విధులు నిర్వహిస్తున్న రావికమతం ఏఈగా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన ఏఈకి సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

లైసెన్స్ ఫీజ్ కార్యాలయంలోనే చెల్లించాలి

నర్సీపట్నం : మున్సిపాలిటీ పరిధిలోని వ్యాపార లైసెన్సు ఫీజులను మున్సిపల్ కార్యాలయంలోనే చెల్లించాలని కమిషనర్ జంపా సురేంద్ర సూచించారు. కొంత మంది ఆగంతకులు హోటల్స్, పెట్రోల్ బంక్‌లకు ఫోన్‌లు చేసి వ్యాపార లైసెన్సు, రెన్యూవల్ లైసెన్సు, ఇతర పన్నులు కట్టాలని బెదిరిస్తున్నట్లు తన దృష్టికి తీసుకువచ్చిందన్నారు. అటువంటి ఫోన్ కాల్స్‌కు రెస్పాండ్ అవ్వద్దన్నారు. ఫోన్ పే, ఇతర మార్గాల ద్వారా కట్టవద్దు అని సూచించారు. నేరుగా మున్సిపల్ కార్యాలయానికి వచ్చి చెల్లించాలన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితం



లంకవానిపాలెంలో గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శైలజ

కె.కోటపాడు : గర్భిణులు ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలను నిర్వహించుకోవాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ అన్నారు. పీహెచ్‌సీలో బుధవారం ప్రధాన మంత్రి మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు ఆరోగ్య తనిఖీలను జరిపారు. ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలు నిర్వహించడం వల్ల తల్లీబిడ్డ ఆరోగ్యంగా క్షేమంగా ఉంటారని వైద్యాధికారి సూచించారు. ఈ సందర్భంగా 26 మంది గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 9 మందికి స్కానింగ్ పరీక్షలకు కె.కోటపాడు సీహెచ్‌సీకి రిఫర్ చేశారు. గర్భిణులు ఎక్కువగా ఆకుకూరలు, పప్పు దినుసులతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు.

విధుల్లో చేరిన ఏపీవో కాశీ

మాకవరపాలెం: ఉపాధి పథకం పీవోగా కాశీ విధుల్లో చేరారు. ఇప్పటివరకు ఇక్కడ ఏపీవోగా పనిచేస్తున్న వరలక్ష్మిని రాంబిల్లి ఇటీవల బదిలీ చేశారు. ఆమె స్థానంలో రావికమతంలో పనిచేస్తున్న కాశీని మాకవరపాలెంలో నియమించడంతో బుధవారం విధుల్లో చేరారు. అలాగే నలుగురు టెక్నికల్ సిబ్బంది, ఇంజినీరింగ్ కన్సల్‌టెంట్ కూడా బదిలీ కావడంతో వారి స్థానంలో కొత్తవారు విధుల్లో చేరారు.

14 న నవగ్రహాలు గుడి ప్రతిష్ట

మాడుగుల రూరల్ : మాడుగుల దబ్బకుంట రహదారిలో పంట పొలాల మధ్యలో కొలువు తీరిన పురాతన చరిత్ర కలిగిన శ్రీ భీమలింగేశ్వర స్వామి వారి ఆలయం ఆవరణలో నిర్మించిన నవగ్రహాలు గుడిని ఈ నెల 14 న ప్రారంభించనున్నారు. ఈ మేరకు మాడుగులకు చెందిన బెన్నాబత్తుల మురళి నిర్మించిన నవగ్రహాలు గుడిని ఈ నెల 14 న ప్రారంభించనున్నట్లు, దీనిలో భాగంగా ఈ నెల 13వ తేదీన హోమాది కార్యక్రమాలు, 14న అన్నసమారాధన జరుగుతుందన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు జరుగుబిల్లి సుబ్బారావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మురళి పేర్కొన్నారు.

శ్మశాన వాటికలో బోరు ఏర్పాటు



శ్మశానవాటికలో బోరు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

గొలుగొండ : చీడిగుమ్మల శ్మశాన వాటిక పనులు స్థానిక తెలుగుదేశం నేతలు ప్రారంభించారు. ఈ గ్రామంలో ఉన్న శ్మశానంలో మౌలిక సదుపాయాల కోసం రూ.25 లక్షల వరకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు మంజూరు చేసినట్టు టీడీపీ నేతలు బీమిరెడ్డి సత్యనారాయణ, కమిరెడ్డి గోవింద్, లెక్కల శివ తెలిపారు. బుధవారం బోర్‌వెల్ ఏర్పాటు చేశామన్నారు.

వేసవి దుక్కుల్లో రైతులు బిజీబిజీ

- మరో వైపు జోరుగా రబీ కోతలు
- 16వేల ఎకరాల్లో సాగుకు సన్నద్ధం



మాడుగుల మండలం సాగరంలో వేసవి దుక్కులు చేస్తున్న రైతు

మాడుగుల : ప్రస్తుతం రబీ వరి కోతలు ముమ్మరంగా సాగుతుండగా మరోవైపు రైతులు వేసవి దుక్కులు చేస్తూ బిజీబిజీగా ఉన్నారు. రానున్న ఖరీఫ్ పంటలు సాగుకు సంబంధించి రైతులు మెట్టు దుక్కులు చేస్తున్నారు. వేసవీ దుక్కులతో కలుపు నివారించడంతో పాటు నేలల్లో ఉన్న పురుగులు నశించి ఖరీఫ్ పంటలకు అనుకూలంగా ఉంటాయి. ఖరీఫ్ చెరకు సాగుతో పాటు వరి నారు మళ్లకు మెట్టు సాగు ఎంతో దోహద పడుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ఈ ఏడాది మండలంలో 16 వేల ఎకరాల్లో సాగు చేయడానికి రైతులు సన్నద్ధం అవుతున్నారు. రబీ పంట కాలం పూర్తవడంతో రైతులు ఖరీఫ్ పంట సాగుపై దృష్టి సారించారు. మండలంలో సాగరం, ఎం. కోడూరు, మాడుగుల, పొంగలిపాక, సత్యవరం, గాదిరాయి. జంపెన, ఎం. కోడూరు, తదితర గ్రామాల్లో జోరుగా రైతులు వేసవి దుక్కులు చేస్తున్నారు.

వేసవి దుక్కులు లాభదాయకం

వేసవీ దుక్కులు లోతుగా దున్నడం వల్ల భూముల్లోపల దాగి ఉన్న హానికర పురుగులు నశిస్తాయి. కలుపు విత్తనాలు నశించడం వల్ల ఖరీఫ్ పంట సాగులో కలుపు తగ్గించవచ్చు. ఈ సమయంలో సేంద్రియ ఎరువులు వేసవి దుక్కుల్లో కలియదున్నడం వల్ల ఖరీఫ్ పంటల దిగుబడి బాగుంటుంది. రసాయనిక ఎరువులు వాడకం తగ్గడంతో పాటు తెగుళ్ల నివారించవచ్చు. – ఎం.వాసుదేవరావు, వ్యవసాయాధికారి, మాడుగుల

వేసవి దుక్కులు తప్పని సరిగా చేస్తాం

రబీ పంటకాలం పూర్తయిన వెంటనే ప్రతి ఏటా వేసవి దుక్కులు చేస్తున్నాం. వేసవి దుక్కుల్లో పశువుల ఎరువులు కలుపుతున్నాం. ఖరీఫ్ వరి నారుమడుల్లో కలుపు నివారణకు ఉపయోగపడుతుంది. – పరేర రామునాయుడు, రైతు, గాదిరాయి

టీడీపీ నాయకుడి భూకబ్జాలపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు



తెలుగుదేశం పార్టీ నాయకుడు నరసింహనాయుడుపై ఫిర్యాదు చేస్తున్న కింతాడ గ్రామస్తులు

కె.కోటపాడు : కింతాడ గ్రామ తెలుగుదేశం నాయకుడు బండారు నరసింహనాయుడు భూ ఆక్రమణలపై గ్రామానికి చెందిన కుఖిరెడ్డి సన్నిబాబుతో పాటు పలువురు గ్రామస్తులు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి ఫిర్యాదు చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఈమేరకు ఫిర్యాదు అందజేశారు. తప్పుడు డాక్యుమెంట్‌లు సృష్టించి పలువురి భూములను కబ్జా చేయడంతో పాటు ఆ పత్రాలతో బ్యాంక్‌ల్లో రుణాలు పొందినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. వచ్చే నెలలో కె.కోటపాడులో నిర్వహించే ప్రజాదర్బార్ కార్యక్రమంలోగా ఈ సమస్యపై అధికారులు పూర్తి విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయనున్నట్టు ఎమ్మెల్యే బండారు వారికి తెలియజేశారు. కాగా కార్యక్రమంలో మొత్తం 167 మంది తమ అర్జీలను ఎమ్మెల్యేకు అందించారు. వీటిలో 140 రెవెన్యూ సంబంధిత అర్జీలు ఉన్నాయి. అర్లి గ్రామానికి చెందిన ఎం.మరిడయ్య తనకు గతంలోనే ప్రభుత్వం డి–ఫారం భూమిని మంజూరు చేసి పట్టా ఇచ్చిందదని, ఈ భూమికి పట్టాదార్ పాస్‌పుస్తకాలను ఇప్పించాలని కోరారు. చింతపాలెం గ్రామానికి చెందిన శీరంరెడ్డి రమణమ్మ తమ సాగులో ఉన్న బంజరు భూమికి పట్టాను మంజూరు చేయాలని కోరారు. వీటితో పాటు వివిధ శాఖల ద్వారా సమస్యల పరిష్కారానికి 27 మంది అర్జీలు అందించారు. వీటిని ఆయా శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి నిర్ణీత వ్యవధిలోగా సంతృప్తికర పరిష్కారాన్ని అర్జీదారులకు ఇవ్వాలని ఎమ్మెల్యే ఆదేశించారు. నెలలో ఒక బుధవారం కె.కోటపాడు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో కలిసి ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ నిర్వహిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.రమేష్‌బాబు, ఎంపీడీవో సాంబశివరావు, రాష్ట్ర కొప్పలవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేష్‌తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐటీఐ ట్రేడ్ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకోండి

నర్సీపట్నం : ఆల్ ఆలిండియా ట్రేడ్ టెస్ట్‌కు ప్రైవేటుగా వివిధ ట్రేడ్‌లలో ప్రైవేట్‌గా పని చేసుకునే అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాస చార్యులు పేర్కొన్నారు. ఐటీఐకు సంబంధించిన ట్రేడ్‌ల్లో నైపుణ్యం కలిగి ప్రైవేట్‌గా పని చేసుకునే వారికి సర్టిఫికెట్ పొందేందుకు ప్రభుత్వం మంచి అవకాశం కల్పించిందన్నారు. అప్రెంటిస్ ట్రెనింగ్ ఇస్తున్న కంపెనీలు, ఎంఎస్ఎంఈలు, రిజిస్టర్ ఎస్టాబ్లిష్‌మెంట్‌లలో కనీస అనుభవం కేటగిరిని బట్టి ఏడాది నుంచి 3 ఏళ్లు ఉండాలన్నారు. మీరు పని చేస్తున్న కంపెనీ వివరాలు, ట్రేడ్‌కు సంబంధించిన వివరాలతో పాటు సర్వీస్ సర్టిఫికెట్‌ను దగ్గరలో గల గవర్నమెంట్ ఐటీఐలో సంప్రదించాలన్నారు. ఈ నెల 12వ తేదీగాలోగా అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

16న దేవస్థానం భూముల బహిరంగ వేలం

రోలుగుంట : రోలుగుంట గ్రామానికి చెందిన శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానం భూములకు ఈ నెల 16న బహిరంగ వేలం నిర్వహించనున్నారు. కొండపాలెం రెవెన్యూ సర్వే నంబరు 14లో ఎకరా 90 సెంట్లు (పల్లం), కంచుగుమల రెవిన్యూ 39/7, 200/1,200/3 సర్వే నంబర్లలో గల రెండెకరాల 80 సెంట్లు, పెదబొడ్డేపల్లి రెవిన్యూ 295 సర్వే నంబర్లో గల 31 సెంట్లు, అడ్డసరం రెవిన్యూ 79/8 సర్వే నంబరులో ఎకరా విస్తీర్ణంలో గల భూములకు 6, 3 ఏళ్ల కాలపరిమితికి కౌలుకు సంబంధించి దేవదాయశాఖ అధికారులు వేలం నిర్వహిస్తారు. ఆసక్తి గల రైతులు ధరావతు సొమ్ము చెల్లించి దేవస్థానం పేరున మూడు ఖాళీ చెక్కులు ఇవ్వాలని, వేలంపాటదారు ఆధార్ కాపీ ఇచ్చి పాటలో పాల్గొనాలని అధికారులు సూచించారు. మరిన్ని వివరాలకు 630309838 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వడ్డాదిలో చలివేంద్రం ఏర్పాటు చేసిన వైస్ ఎంపీపీ



వడ్డాదిలో చలివేంద్రంలో పాల్గొన్న నాయకులు

బుచ్చెయ్యపేట : మండలంలో గల మేజర్ పంచాయితీ వడ్డాదిలో వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి తన సొంత నిధులతో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. నారాయణమూర్తి తన తల్లిదండ్రులు దొండా నారిబాబు,సత్యనారాయణమ్మల జ్ఞాపకార్థం గత 12 సంవత్సరాలుగా వడ్డాదిలో వేసవి కాలంలో చలి వేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది మజ్జిగ చలివేంద్రం రోజూ ఏర్పాటు చేస్తున్నామని పాదచారులు, ప్రజలు మజ్జిగ చలివేంద్రం సద్వినియోగం చేసుకోవాలన్నారు. చలివేంద్రం ప్రారంభోత్సవంలో నాయకులు,వర్తక సంఘ నాయకులు కోవెల జనర్ధనరావు, పలుకూరి బంగార్రాజు, సయ్యపురెడ్డి శ్రీనివాసరావు, గుమ్మిడి ప్రసాద్, పల్లెల వరహాలబాబు, అడపా వరహాలబాబు, అదగ్రా రాజు పాల్గొన్నారు.

ఎం.అలమండలో కూలిన విద్యుత్ స్తంభాలు



ఎం.అలమండలో నేల కూలిన ట్రాన్స్‌ఫార్మర్‌తో కూడిన విద్యుత్ స్తంభం



ఎం. అలమండలో విద్యుత్ స్తంభం కూలిపోవడంతో రోడ్డుపై పడిన విద్యుత్ తీగలు

తప్పిన పెనుప్రమాదం

దేవరాపల్లి : ఎం.అలమండ గ్రామంలో బుధవారం పెను ప్రమాదం తప్పింది. ఎం.అలమండలో వారాడ వైపు వెళ్లే ప్రధాన మార్గంలో అకస్మాత్తుగా మూడు విద్యుత్ స్తంభాలు విరిగి నేల కూలాయి. ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉండడంతో స్థానిక ప్రజలు భయంతో పరుగులు తీశారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో ఆ సమయంలో అదృష్టవశాత్తు ఏ వాహనాలు రాలేదు. స్థానికులు అప్రమత్తమై విద్యుత్ సరఫరాను నిలిపి వేయడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. వివరాలిలా ఉన్నాయి. ఎం.అలమండలో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఏనాడో వేసిన విద్యుత్ లైన్‌లో కొన్ని స్తంభాలు అడుగు భాగంలో పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో బుధవారం ముందుగా ఒక స్తంభం విరిగిపోగా ఆ ధాటికి మరో రెండు స్తంభాలు విరిగిపోయాయని గ్రామస్తులు తెలిపారు. వీటిలో ట్రాన్స్‌ఫార్మర్‌తో కూడిన స్తంభం కూడా ఒకటి ఉంది. విద్యుత్ శాఖ ఏఈఈ కె.శంకరరావు తన సిబ్బందితో కలిసి ఎం. అలమండలో విరిగిన స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలు వేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. స్తంభాలు కూలక ముందే తొలగించి వాటి స్థానంలో కొత్త స్తంభాలు వేయాలని ప్రజలు కోరినా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించ లేదని గ్రామస్తులు ఆరోపించారు. ఈ విషయాన్ని విద్యుత్ ఏఈఈ కె.శంకరరావు వద్ద ప్రస్తావించగా స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నట్టు తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు. విరిగిన స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు వేశామని, గ్రామంలో దెబ్బతిన్న స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు వేశామని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



జి.భీమవరంలో ప్రకృతి వ్యవసాయ ఘన, ద్రవ జీవామృతాల తయారీని పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయం ప్రాంతీయ అధికారి ప్రకాష్

కశింకోట: ప్రకృతి వ్యవసాయ విధానంలో 9 జాతులకు చెందిన నవ ధాన్యాల విత్తనాలు నాటుకొని సాగు చేయడం ద్వారా భూమి సారవంతం కావడమే కాకుండా రైతులు అదనపు ఆదాయం కూడా పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయం ప్రాంతీయ అధికారి కె.ప్రకాష్ అన్నారు. మండలంలోని జి.భీమవరంలో 50 మంది రైతు మాస్టర్ ట్రైనర్లు, నోడల్ అధికారులకు ప్రకృతి వ్యవసాయం సాగుపై క్షేత్ర స్థాయిలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరాకు 12 కిలోల నవ ధాన్యాల విత్తనాలు నాటుకోవాలన్నారు. దీని వల్ల భూమి సారవంతంగా, ఆరోగ్యకరంగా తయారు అవుతుందన్నారు. మొక్కలను పచ్చి రొట్ట ఎరువుగా వినియోగించుకోవచ్చునన్నారు. వాటి ద్వారా వచ్చే ఫల సాయం విక్రయించుకోవడం వల్ల అదనంగా ఆదాయం సమకూరుతుందన్నారు. అనంతరం నాణ్యమైన ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారీపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. అనంతరం సుందరయ్యపేట గ్రామంలో మెగా ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న ప్రకృతి వ్యవసాయ కషాయాలు, ద్రావణాల గురించి, వాటి తయారీ విధానాన్ని ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ప్రాంతీయ అధికారి జి.హేమసుందర్, సీనియర్ అసోసియేట్లు కుంజా అనంతరాం, నీలిమ, మోడల్ మేకర్ కాయల దేవి, ప్రకృతి వనరుల కేంద్రం నిర్వాహకురాలు కూండ్రపు అరుణ, ఎల్–1 ద్వారపురెడ్డి రమణ, ఎల్–2 ద్వారపురెడ్డి వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణకు మాత్రల పంపిణీ



విద్యార్థులకు మాత్రలు వేస్తున్న కామేశ్వరరావు

మాడుగుల రూరల్ : వేసవికాలం దృష్ట్యా విద్యార్థులు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించడం ముఖ్యమని అతిథి దేవోభవ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి కామేశ్వరరావు తెలిపారు. వీరవిల్లి అగ్రహారం పాఠశాలలో విద్యార్థులకు బుధవారం వడదెబ్బ ఉపశమనం కలిగించడంతో పాటు ఎండ తీవ్రతను తట్టుకునేందుకు హోమియో మాత్రలను విద్యార్థులకు అందించారు. ఈ నేట్రంమూర్ అనే హోమియో మందును వేసుకోవడం ద్వారా వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు వ్యాధి నిరోధకశక్తి మెరుగుపడుతుందని కామేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది కిషోర్, జయలక్ష్మి అనురాధ, ఆనంద్, సూర్యకుమారి పాల్గొన్నారు.

నేడు సత్యమాంబ ఆలయ వార్షికోత్సవం

కశింకోట: కశింకోటలోని శారదానది అవతల వంతెన వద్ద కొలువైన శారదా సత్యమాంబ అమ్మవారి ఆయన దశమ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని అందంగా అలంకరించారు. ఉదయం 9.30 గంటలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, మధ్యాహ్నం 12 గంటలకు అన్నసమారాధన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



క్రీడా మైదానంలో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

అనకాపల్లి: స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి నెల పండగ జాతరలో భాగంగా ఎన్టీఆర్ క్రీడా మైదానంలో బుధవారం ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విజయవాడకు చెందిన చిన్నారుల నృత ప్రదర్శన, కోలాటాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కళాకారులకు ఉత్సవ కమిటీ సభ్యులు ప్రోత్సాహక సర్టిఫికెట్లు అందజేశారు.

నూకాంబిక సన్నిధిలో మావూరి

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారిని సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ దంపతులు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను ఆయనకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.రాంబాబు, ఆలయ ధర్మకర్తలు, అర్చకులు పాల్గొన్నారు.

రోగులకు సేవల విషయంలో నిర్లక్ష్యం వద్దు



గునుపూడి పీహెచ్‌సీలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

నాతవరం : పీహెచ్‌సీకి వైద్యం కోసం వచ్చే రోగులకు వైద్య సేవలు అందించే విషయంలో నిర్లక్ష్యం చేయకుండా పని చేస్తే ఈ ప్రాంతీయుల మన్ననలు పొందుతారని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. గునుపూడి పీహెచ్‌సీలో బుధవారం వైద్యాధికారి చిటికిల అనూష్ ఆధ్వర్యంలో అభివృద్ధి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా పీహెచ్‌సీలో ఉన్న ప్రధాన సమస్యలను వైద్యాధికారి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గునుపూడి పీహెచ్‌సీ మారుమూల ప్రాంతంలో ఉందన్నారు. ఈ పీహెచ్‌సీ పరిధిలో అధికంగా గిరిజన గ్రామాలు ఉన్నాయని ఈ ప్రాంతంలో ఉన్న పంచాయతీలు సైతం రెండు జిల్లాల సరిహద్దులో ఉన్నాయన్నారు. ఈ ప్రాంత గ్రామాలకు ఆర్‌టీసీ సదుపాయం లేకపోవడంతో ప్రైవేటు వాహనాలపై ఆధారపడి ప్రయాణించాలన్నారు. అందువల్ల ఈ ప్రాంత ప్రజలు ఎలాంటి ఆరోగ్య సమస్య వచ్చినా ముందుగా పీహెచ్‌సీ వైద్యం కోసం వస్తుంటారన్నారు. పీహెచ్‌సీ అభివృద్ధికి కావలసిన సదుపాయాలు మండల పరిషత్ ద్వారా సర్పంచ్ వేముల సూర్యనారాయణ ఆధ్వర్యంలో సమకూర్చుతానన్నారు. ఈ పీహెచ్‌సీకి ల్యాబ్‌కు సంబంధించి అదనపు భవనం నిర్మాణం కోసం రూ.39 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ భవన నిర్మాణం పూర్తయితే ల్యాబ్‌కు సంబంధించి వసతి సమస్య తీరుతుందన్నారు. కార్యక్రమంలో గునుపూడి సర్పంచ్ వేముల సూర్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వేముల సూరిబాబు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై పారదర్శకంగా దర్యాప్తు చేయాలి



చోడవరం కొత్తూరు జంక్షన్ వద్ద మానవహారం చేస్తున్న క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

చోడవరం : పాస్టర్ ప్రవీణ్ మృతిపై పారదర్శకంగా దర్యాప్తు చేయాలని కోరుతూ చోడవరం నియోజకవర్గం క్రైస్తవ సంఘాలు బుధవారం నిరసన ర్యాలీ చేశారు. నియోజకవర్గంలో అన్ని క్రైస్తవ సంఘాలు మూకుమ్మడిగా ఈ ర్యాలీలో పాల్గొన్నాయి. చోడవరం మెయిన్‌రోడ్డు మీదుగా ర్యాలీ చేసి కొత్తూరు జంక్షన్ వద్ద మానవహారం చేశారు. క్రైస్తవులపై దాడులుచేస్తే సహించేది లేదని, పాస్టర్ ప్రవీణ్ మృతిపై పారదర్శకంగా న్యాయవిచారణ జరపాలని, దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. క్రైస్తవులపై మతోన్మాద శక్తులు దాడులకు పాల్పడుతున్నాయని, వాటిని అరికట్టాలని తమను కాపాడాలని డిమాండ్ చేశారు. పాస్టర్ ప్రవీణ్ మృతిని హత్యగా క్రైస్తవ సంఘాలు భావిస్తున్నాయని, ఆ దిశగా దర్యాప్తు చేస్తే నిజాలు బయటకు వస్తాయని సంఘ ప్రతినిధులు నోవహు, భూషణం, ఎం. హోసన్నా అన్నారు. ఈ ఆందోళనలో యేసుపాదం, యేసు రాజన్, బి.రవి కుమార్, ఎస్.అజయ్‌ప్రసాద్, కృపా శేఖర్, జై ప్రసాద్ పాల్గొన్నారు.

43 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు

దేవరాపల్లి : దేవరాపల్లి పీహెచ్‌సీలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు ఈ.పూజ్య మేఘన, డి.వనజలు గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి హాజరైన 43 మంది గర్భిణులు తనిఖీలు చేశారు. వీరిలో పది మందిని మెరుగైన వైద్య సేవల కోసం ఇతర ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించారు. ఈ సందర్భంగా గర్భిణి దశలో తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవించే వరకు వైద్య సలహాలు పాటించాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అధిక పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ప్రసాద్, పీహెచ్ఎన్ బి.సునీత, హెచ్‌వీ లక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ పుష్పరాజ్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్లు ప్రారంభం

కె.కోటపాడు : కె.కోటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్‌లను ప్రారంభించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగమణి అన్నారు. కళాశాలలో బుధవారం ఆమె ఈ వివరాలను విలేకరులకు తెలిపారు. ఈ నెల 7 నుంచి మొదటి సంవత్సరం విద్యార్థుల అడ్మిషన్‌లు తీసుకునే కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు ఆమె తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులకు అడ్మిషన్‌లు ఇస్తున్నట్టు తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు ఏడాదికి రూ.2408, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులకు ఏడాదికి రూ.1418 మాత్రమే చెల్లించాలని ఆమె తెలిపారు. ఇంగ్లిష్, తెలుగు మీడియంలలో విద్యార్థులకు బోధించనున్నట్లు తెలిపారు. కళాశాలలో చేరే విద్యార్థులకు ఉచితంగా నోట్, పాఠ్య పుస్తకాలు ఇవ్వడంతో పాటు కళాశాలలో మధ్యాహ్న భోజనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

22 తేదీ వరకు పౌష్టికాహార పక్షోత్సవాలు



సరుగుడులో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు, ప్రజాప్రతినిధులు

నాతవరం : ప్రాజెక్టు పరిధిలో ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని గొలుగొండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి శ్రీగౌరి అన్నారు. సరుగుడు పంచాయతీలో బుధవారం పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధ్యక్షతన అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి ప్రధాన కూడలి జంక్షన్‌లో మాట్లాడారు. ప్రాజెక్టు అధికారి శ్రీగౌరి మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల ప్రకారం ఈనెల 8వ తేదీ నుంచి ఈనెల 22వ తేదీ వరకు పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి గ్రామంలో విధిగా ఈ కార్యక్రమం నిర్వహించి తాము అందిస్తున్న సేవల గురించి వివరిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు స్వచ్ఛంద సంస్థ సభ్యులు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ

మాడుగుల రూరల్ : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ పర్యవేక్షురాలు వై. ఈశ్వరమ్మ పేర్కొన్నారు. 7 వ పౌష్టికాహార పక్షోత్సవాలు పురస్కరించుకుని కింతలి వల్లాపురం–2 కేంద్రంలో పక్షోత్సవాలను పురస్కరించుకుని, బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కింతలి సెక్టారు పరిధిలో గల 20 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంపై ప్రత్యేక దృషి సారించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. ఈ నెల 22 వ తేదీ వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన సదస్సులు, పౌష్టికాహార ప్రదర్శనలు నిర్వహించి, ప్రజల్లో అవగాహన పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాయన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.